క్లుప్తంగా

ఎయిర్‌పోర్టు సీఐగా హశ్వంత్‌కుమార్


సీఐగా బాధ్యతలు స్వీకరించిన హశ్వంత్‌కుమార్

ఓర్వకల్లు: స్థానిక ఎయిర్‌పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.హశ్వంత్ కుమార్ నియమితులైనట్లు డైరెక్టర్ విద్యాసాగర్ సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేర కు.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్ పోర్టులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సన్యాసయ్య విజయవాడకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో ఇక్కడే ఎస్‌ఐగా పనిచేస్తున్న హశ్వంత్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసినట్లు తెలిపారు. ఆ మేరకు సోమ వారం హశ్వంత్‌కుమార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


సి.బెళగల్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో కలిసి పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణదొడ్డి, పోలకల్, సి.బెళగల్ తదితర గ్రామాల నుంచి రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలను ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ అర్జీల సమస్యలపై వీఆర్వోలతో చర్చించి, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే సాగునీటి పన్నులను వీఆర్వోలు వంద శాతం వసూళ్లు చేయాలని ఆదేశించారు. ఆర్‌ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం, ఏఈఓ హిమబిందు పాల్గొన్నారు.

నియామకం

పాణ్యం: ఏపీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పెరుగు శివక్రిష్ణను సోమవారం ఆ విభాగం వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు నియమించారు. విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాలు చేసి ఉన్నత స్థాయికి చేరుకున్న శివక్రిష్ణ భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించి సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. తనకు కేటాయించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని శివక్రిష్ణ అన్నారు.

విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి

పాణ్యం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి సూచించారు. సోమవారం పాణ్యంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. మత్తుకు అలవాటు పడ్డ విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుదో వివరించారు. విద్యార్థులు వాటికి బానిస కాకుండా జాగ్రత్త పడాలన్నారు. మత్తు పదార్థాలను గుర్తిస్తే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 8977781972కు ఫిర్యాదు చేయాలన్నారు. నంద్యాల ఈగల్ సిబ్బంది మనోహర్, ప్రసాద్ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. సిబ్బంది రఫీక్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలి

పాణ్యం: ఈనెల 10న ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించే క్రమంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో అందుతున్న విద్యాబోధన, టెక్నాలజీ, మధ్యాహ్న భోజనం, పాఠశాల అభివృద్ధి అంశాలను వివరించాలన్నారు. డీటీ శివశంకర్‌రెడ్డి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లతో అందరికీ ఫలాలు

పాణ్యం: ఏబీసీడీ వర్గీకరణతో అందరికీ సమానంగా ఫలాలు అందుతాయని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ అన్నారు. సోమవారం పాణ్యంలోని ఎస్సీ కాలనీలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకొని జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు చేసి, కేసులను ఎదుర్కొని, అందరి సహకారంతో నేడు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో వర్గీకరణ అమలు జరుగుతుందన్నారు. అలాగే నెరవాడ గ్రామంలో జెండా ఎగరవేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసింహ, బాబు, తిమ్మన్న, వెంకటాద్రి పాల్గొన్నారు.

ఈసారైనా సాగు నీరందేనా..?

- కర్ణాటక జలచౌర్యం కారణంగా ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు అందని నీరు
- సాగునీటి కోటా సాధించడంలో అధికారులు, పాలకులు విఫలం
- ప్రస్తుతం నిండుగా టీబీ ట్యాం
- ఈ సారి పూర్తి స్థాయిలో నీరివ్వాలని కోరుతున్న రైతులు


దిగువ కాలువలో పారుతున్ననీరు (ఫైల్)

ఎమ్మిగనూరు టౌన్: ఏటా ఎల్లెల్సీ ఎగువన ఉన్న కర్ణాటక రైతులు నీటి చౌర్యం కారణంగా దిగువన వున్న ఎమ్మిగనూరు, కోడుమూరు సబ్‌డివిజన్ల పరిధిలో ఆయకట్టుకు సాగునీరందడం లేదు. దీంతో పంటలు పండక రైతులు అప్పులపాలవుతున్నారు. ఆంధ్రాకు ఖరీఫ్‌లో రావాల్సిన సాగు నీటి కోటా సాధించడంలో పాలకవర్గం, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు విఫలమవుతుండటంతో ఎల్లెల్సీ కింద సాగు విస్తీర్ణం పడిపోతూ వచ్చింది. అయితే ఈసారి టీబీ డ్యాం పూర్తిగా నిండడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా చివరి ఆయకట్టుకు సాగునీరందుతుందని కోటి ఆశలు పెట్టుకున్నారు.

15వేల ఎకరాలకు గాను 8 వేల ఎకరాలకే నీరు..

ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు గాను తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర నీటి కోటా కింద దిగువ కాలువకు 650 క్యూసెక్కులు రావాల్సివుండగా అందులో ఎమ్మిగనూరు సబ్‌డివిజకు 326 క్యూసెక్కుల మేర అందాలని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా అయితే ఒక్క ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 15వేల ఎకరాల్లో పంటలకు సాగు నీరందాల్సివుంది. అయితే సాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో ఏటా 8వేల ఎకరాల లోపే నీరందిస్తున్నారు. అదేవిధంగా కోడుమూరు సబ్‌డివిజన్ కేబీసీ పరిధిలో కూడా దాదాపు 18వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి వుండగా ఆ మేరకు సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరికి అందని చివరి తడులు..

ఏటా ఖరీఫ్‌లో సాగు కావాల్సిన వరి పంటలకు పూర్తి స్థాయిలో నీరందక తిండి గింజలు పండించుకోలేని దుస్థితిలో వున్నామని రైతులు వాపోతున్నారు. వరి సాగు చేస్తే చివరి తడి అందకపోతుండటంతో వరి పంటకు ఆయకట్టు రైతులు విరామం పలికి పత్తి తదితర పంటలను సాగు చేసుకుంటున్నారు. అధికారులు కూడా స్వల్పకాలిక పంటలే వేసుకోండని ఏటా పేర్కొంటుండటంతో గత్యంతరం లేక ఆయా పంటలనే వేసుకోవాల్సి వస్తోంది. పంటలు చేతికి వచ్చే సమయంలో దిగువ కాలువకు వారబందీ పద్ధతిలో సాగునీరు సరఫరా చేస్తుండటంతో సకాలంలో సాగునీరందక పంటల దిగుబడులు రాక నష్టపోయే దుస్థితి ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఏటా ఖరీఫ్‌లో దిగువ కాలువ కింద కర్ణాటక ప్రాంతంలో జలచౌర్యం పెరిగిపోయినా దానిని నివారించలేకపోతుండటంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడే దుస్థితి ఉంటుంది.

నిండుగా తుంగభద్ర

ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో వరద నీరు వచ్చి చేరడంతో అదనంగా వచ్చిన నీటిని క్రస్ట్‌గేట్లు ఎత్తి తుంగభద్ర నదికి విడుదల చేస్తున్నారు. డ్యాం నిండుగా వుండటంతో దిగువ కాలువ కింద ప్రస్తుత సీజన్‌లోనైనా సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కుతామని రైతులు భావిస్తున్నారు. ఆ మేరకు ప్రభుత్వం దిగువ కాలువ కింద పూర్తిస్థాయిలో సాగునీరందించి, చివరి ఆయకట్టులో ఖరీఫ్ పంటకాలం పూర్తయ్యే వరకు నిర్దేశించిన నీటి కోటా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎల్లెల్సీ రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్‌కు ఈసారైనా పూర్తిగా నీరివ్వాలి



ఎల్లెల్సీ ఆయకట్టు కింద 6 ఎకరాలు ఉంది. అయితే వరి సాగుకు పూర్తి స్థాయిలో సాగునీరందదని పత్తి సాగు చేశా. మా గ్రామ పరిధిలో రైతులంతా పత్తి సాగు చేసుకుంటున్నారు. పంట చేతికి వచ్చే దశలో సాగునీరందదు. మొదట్లో నీరు సక్రమంగా వచ్చినా తరువాత అస్తవ్యస్తంగా మారి నీటి సరఫరా లేక పంటలను కోల్పోతూ నష్టపోతున్నాం .తుంగభద్ర లో నీరు ఎక్కువ వుంది కాబట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు పంట కోత వరకు విడుదల చేసి ఆదుకోవాలి.

– లోకారెడ్డి, పెద్దనెలటూరు గ్రామం

ఎల్లెల్సీ కింద ఖరీఫ్ ఆయకట్టు విస్తీర్ణం పెంచాలి



తుంగభద్ర దిగువ కాలువ కింద ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు విస్తీర్ణం పెంచి సాగునీరివ్వాలి. ప్రాజెక్ట్‌లో నీరు పుష్కలంగా వున్నందున ఆయకట్టుకు సాగు నీరిస్తే ఇప్పటి వరకు సాగు ఉపక్రమించని రైతులు వరి పంట సాగు చేసే అవకాశం వుంది. వరి సాగు చేసే రైతులకు పంట పూర్త య్యే వరకు సాగునీరిస్తామని అధికారులు భరోసా ఇవ్వాలి, ఆమేరకు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలి. – గద్దం లక్ష్మీనారాయణరెడ్డి, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి

పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహం


పశుగ్రాసం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గడివేముల: పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు వంద శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు నంద్యాల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. పశుగ్రాసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం బూజునూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాల్లో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పశుగ్రాసం సాగు చేసే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు చెల్లించనున్నట్లు చెప్పారు. పాణ్యం అసిస్టెంట్ డైరెక్టర్ కమలాకర్, డాక్టర్ సాయి హరిణి, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం

గడివేముల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ'పై విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ మధుసూదన్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు


కోడుమూరులో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్


గూడూరులో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ దస్తగిరి రెడ్డి

కోడుమూరు రూరల్: దుకాణదారులు అధిక ధరకు ఎరువులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. సోమవారం కోడుమూరులోని ఎరువుల దుకాణంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎరువులకు సంబంధించి రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని, అలాగే రైతు సేవా కేంద్రాలకు 220 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని, త్వరలోనే రానుందని చెప్పారు.

గూడూరులో..

గూడూరులోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ఏఓ దస్తగిరి రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఎరువుల స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదని, ఎవరైనా దుకాణదారులు కృత్రిమ సృష్టిస్తే చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు.

నేడు వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు

ఓర్వకల్లు: దివంగత ముఖ్యమంత్రి, జనహృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయ కులు కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానీ యుని జయంత్యుత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 8.30 గంటలకు నిర్వహించే వేడుకలకు పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): రేషనలైజేషన్‌లో భాగంగా కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు పాణ్యం నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జేసీ డాక్టర్ బి.నవ్య రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని ఎన్నికల కమిషన్ సూచించిన నేపథ్యంలో స్టేషన్లను నవీకరించినట్లు చెప్పారు. అందులో భాగంగా కర్నూలు మండలంలో 14, ఓర్వకల్లు మండలంలో 4, పాణ్యంలో ఒక పోలింగ్ స్టేషన్ పెరిగినట్లు చెప్పారు. పెరిగిన స్టేషన్లన్నీ ఒకే భవన సముదాయంలో వేర్వేరు గదుల్లో ఉంటాయన్నారు. మరోవైపు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని, ఇందుకోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఓర్వకల్లు తహసీల్దార్ బీవీఎస్ విద్యాసాగర్, గడివేముల తహసీల్దార్ వెంకటరమణ, పాణ్యం తహసీల్దార్ వై.నరేంద్రనాథ్ రెడ్డి, ఎలక్షన్ డీటీ జి.అనురాధ పాల్గొన్నారు.

బాలిక హత్యాచారం కేసును సీబీఐకి అప్పగించాలి

కర్నూలు (న్యూటౌన్): నందికొట్కూరు నియోజకవర్గం, ముచ్చుమర్రి గ్రామంలో ఏడాది క్రితం జరిగిన బాలిక హత్యాచారం కేసును సీబీఐకి అప్పగించాలని వాల్మీకి బోయ సేవా సంస్థ వ్యవస్థాపకులు కుబేరస్వామి డిమాండ్ చేశారు. సోమవారం వాల్మీకి బోయ సేవా సంస్థ కార్యాలయంలో బాధిత బాలిక ఫ్లెక్సీకి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. నేరస్తులకు శిక్ష పడిన రోజే బాలిక ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. వాల్మీకి నాయకులు జె.శ్రీనివాసులు నాయుడు, బేతం కృష్ణుడు, తలారి కృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ తప్పనిసరి


పలుకుదొడ్డి గ్రామసభలో తనిఖీ నివేదికలను వివరిస్తున్న డీఆర్‌పీ మనోజ్‌కుమార్

సి.బెళగల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే మొక్కల పంపకంలో సిబ్బంది మొక్కలను పరిరక్షించాలని సామాజిక తనిఖీ ఎస్‌ఆర్పీ వెంకటేష్‌నాయక్ సూచించారు. మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో పథకంలో భాగంగా చేపట్టిన పనుల తనిఖీ అంశాలపై సోమవారం డీఆర్పీ మనోజ్‌కుమార్ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగమ్మ అధ్యక్షతన నిర్వహించిన సభకు ఎస్ఆర్పీ హాజరై మాట్లాడారు. అనంతరం తాను చేపట్టిన తనిఖీల నివేదికలను డీఆర్పీ గ్రామ సభలో చదివి వినిపించారు. గ్రామంలో ఉపాధి హామీ ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31వ తేదీ మధ్య కాలంలో 32 పనులు చేపట్టగా, రూ41,92,496 ఖర్చు చేశారని చెప్పారు. తనిఖీల్లో పాఠశాల వద్ద నాటిన మొక్కల్లో 15 మొక్కలు చనిపోయాయని, కొన్ని పనుల కొలతల్లో వ్యత్యాసం గుర్తించినట్లు వివరించారు.ఏపీఎం రామన్న, ఈసీ పృథ్వీరాజ్, టీఏలు మురళి, రాజశేఖర్, ఎఫ్ఏలు ఉన్నారు.

ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలి

ఓర్వకల్లు: ప్రతి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించి, వాటిని తప్పక రిజిస్ట్రేషన్ చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ ఓంకార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీన అన్ని పాఠశాలల్లో పిల్లల తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు నిర్వహించే సమావేశం సంసిద్ధత గూర్చి తెలియజేశారు. షెడ్యూలు ప్రకారం తప్పకుండా సమావేశం నిర్వహించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంఈఓ శ్రీధర్‌బాబు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డీటీపీ ఆపరేటర్లు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం


కోడుమూరులో ఏటికి తరలి వెలుతున్న పీర్లు


సి.బెళగల్‌లో పీర్లను ఊరేగింపుగా ఏటికి తరలిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : పీర్లు ఏటికి వెళ్లడంతో మొహర్రం పూజలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని కోటవీధి, మెయిన్ బజార్, చిన్నబోయవీధి, మోబీన్‌వీధుల్లో దాదాపు 9 ప్రాంతాల్లో పీర్లు కొలువుదీరి వారం పాటు ప్రజల నుంచి పూజలందుకున్నారు. సోమవారం సాయంత్రం పీర్లన్నీ స్థానిక మునిమంద వద్దకు ఊరేగింపుగా చేరుకొని అక్కడి నుంచి ఏటికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా యువకులు డప్పు చప్పుళ్లకు లయబద్ధంగా సాహుసేన్ ఆడగా, భారీగా తరలివచ్చిన ప్రజలు పీర్లకు బుక్కపిండి ఇచ్చి ప్రత్యేక చదివింపులు చదివించారు. అలాగే మండలంలోని ప్యాలకుర్తి, వర్కూరు, పులకుర్తి, కల్లపరి, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అనుగొండ, అమడగుంట్ల, ముడుమలగుర్తి గ్రామాల్లో కూడా పూజలు ముగిశాయి. మొహర్రం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ ఎర్రిస్వామి సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. గూడూరు మండలంలోని చనుగొండ్ల, పెంచికలపాడు, జూలకల్, పోలకల్ , మల్లాపురం, మునగాల, గుడిపాడు గ్రామాల్లో సోమవారం మొహర్రం పూజలు ముగిశాయి.

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో మొహర్రం వేడుకలు సోమవారం ముగిశాయి. మండల కేంద్రంలోని 7 పీర్ల చావిళ్లలో కొలువైన పీర్లకు 7 రోజుల పాటు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సుంతానమ్మ దర్గాకు భారీగా చేరుకున్న భక్తులు సోమవారం తెల్లవారుజాము వరకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా క్రిష్ణదొడ్డి గ్రామ చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. సోమవారం వేకువ జామున సి.బెళగల్, గొల్లలదొడ్డి, ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, పోలకల్, కంబదహాల్, చింతమానుపల్లె తదితర గ్రామాల్లో సవారి నిర్వహించారు. సాయంత్రం అగ్ని గుండాలను పూడ్చి పీర్లను ఊరేగింపుగా ఏటికి తరలించారు. ఎస్‌ఐ పరమేష్ నాయక్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె, గగ్గటూరు గ్రామాల్లో మొహర్రం వేడుకలు సోమవారంతో ముగిశాయి. ప్రత్యేక ఫాతేహాల అనంతరం పీర్లను నిమజ్జనానికి తరలించారు. యువకులు ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ పీర్లను గ్రామాల్లో ఊరేగించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్త్ నిర్వహించారు.

కల్లూరు: గత వారం రోజులుగా పూజలందుకున్న పీర్ల దేవుళ్లు సోమవారం సాయంత్రం ఏటికి తరలివెళ్లారు. పుసులూరు, తడకనపల్లె, బస్తిపాడు తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


ఆకట్టుకున్న క్రిష్ణదొడ్డి చిన్నారుల కోలాటం


కోడుమూరులో పీర్లముందు సాహుసేన్ ఆడుతున్న యువకులు


సి.బెళగల్‌లో పెద్ద సరిగెత్తులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


ఏటికి తరలివెళ్తున్న పీర్లు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ చైర్మన్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి జయప్రకాష్‌నారాయణ పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే నాలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సిబ్బంది ఆయన్ను ఆలయ మర్యాదలతో శేషవస్త్రాలతో సన్మానించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

సి.బెళగల్: ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశాన్ని హెచ్‌ఎంలు, టీచర్లు విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఆదోని డీఎల్‌డీఓ రమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఎంఈఓలు జ్యోతి, ఆదాం బాషా మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులందరూ హాజరయ్యేలా చూడాలని, ఇందుకోసం ఎస్‌ఎంసీ సభ్యులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. తల్లికి వందనం పథకం కింద డబ్బులు రాని విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని పాఠశాలల నుంచి మండల అధికారులకు అందజేయాలని చెప్పారు.

ఆర్థిక సాయం

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన జి.సుబ్రమణ్యం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన మిత్రులు, నందివర్గం స్కూల్ 2008 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు చేయిచేయి కలిపి రూ.51 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను సోమవారం బాధిత కుటుంబానికి అందించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఓర్వకల్లు: రైతులు, కార్మికుల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు గ్రామాల్లో కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడారు. రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, డీవైఎఫ్ఐ ు మహేష్, వెంకటేశ్వర్లు, మధు పాల్గొన్నారు.

గెస్టు ఫ్యాకల్టీకి ఆహ్వానం

ఓర్వకల్లు: స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను ఇంగ్లిష్, గణితం, హిస్టరీ సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థులు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఈ నెల 9వ తేదీన డెమో క్లాస్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమో రోజున ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిందిగా కోరారు.

సంక్షేమ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ


వార్డెన్లు, విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలావెంకటశేషాద్రి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు జిల్లా కలెక్టరేట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ ఆనంద నిలయం హాస్టళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేసి సౌకర్యాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను హాస్టల్ వార్డెన్లు సులోచన, రజినమ్మ, శైలజను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల రిజిస్టర్‌లను పరిశీలించారు. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.